# మారుతున్న పరిస్థితులలో కార్మికుల స్థితిగతులు

## (సింగరేణి బొగ్గు గనులలో కొత్త స్టాండింగ్ ఆర్డర్స్)



ఖమ్మం జిల్లా కొత్తగూడెం నుండి ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ దాకా వ్యాపించి ఉన్న సింగరేణి కాలియరీస్ కంపెనీకి 105 సంవత్సరాల చరిత్ర ఉంది. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో వ్యాపించి ఉన్న బొగ్గు గనులు 1 లక్ష 15 వేలమంది కార్మికులకు పని కల్పిస్తున్నాయి. వ్యవసాయకంగా వెనుకబడిన ఆ ప్రాంత గ్రామీణ యువకులకు ఒక ఆశాదీపంగా ఉంది సింగరేణి. ఒక కొడుకు కయినా 'బొగ్గు బావుల'లో పని సంపాదించగలిగితే పేదరికం నుండి ఒక మెట్టు పైకి ఎక్కినట్లేనని ఆశపడతారు గ్రామీణ పేదరైతులు, కూలీలు.

సింగరేణి ఉత్తరతెలంగాణా గ్రామీణ పేదలకు ఇంకెంతకాలం ఆశాదీపంగా ఉంటుందనేది ఈ రోజు ప్రశ్నార్థకం అయింది. అయిదేళ్ళ కింద సింగరేణి శతాబ్ది ఉత్సవాలు జరుపుకున్నపుడు, ప్రతీ సంవత్సరం కొత్తగా 5వేల ఉద్యోగాలు కల్పించే ప్రణాళిక రూపొందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంటే సంవత్సరానికి ఒక పెద్ద మిల్లు నెలకొల్పినట్టు అవుతుంది. అన్ని ఉద్యోగాలు వస్తాయని ఉత్తర తెలంగాణా రైతాంగ యువకులు ఆశపడ్డారు. అయితే అంతలో నూతన ఆర్థిక విధానం రంగప్రవేశం చేసి కొత్త రిక్రూట్‌మెంట్ బాగా పడిపోయింది. కొత్తగా ఆవిష్కరిస్తున్న 'బావులు' ఓపెన్‌కాస్ట్ బావులు. వీటిలో యంత్రాల వాడకం ఎక్కువ, కార్మికుల వినియోగం తక్కువ. ఈ దెబ్బ చాలదన్నట్లు వివిధ కారణాలు చూపించి 'సర్‌ప్లస్' గా ఉన్నారంటూ కార్మికులను తొలగించడం మొదలయింది. 1993 లో 1200 మందిని ఈ విధంగా ఇంటికి పంపించారు.

సింగరేణి 'నష్టాల'లో ఉందనిచెప్పి బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అప్పగించి బి.ఐ.ఎఫ్.ఆర్ సలహాల మేరకు ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ చర్యలు ప్రారంభించింది.కానీ అన్ని ప్రభుత్వరంగ సంస్థలలో లాగ సింగరేణి విషయంలో కూడ ఈ 'నష్టాలు' అనేది కొంతవరకు కృత్రిమమైన సమస్య. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో 70 శాతం విద్యుత్ ఉత్పత్తికి పోతుంది. అంటే ప్రభుత్వరంగంలో ఉన్న థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కొనుగోలు చేస్తాయి. మిగిలిన 30 శాతం సిమెంట్ ఫ్యాక్టరీలు, ఎరువుల ఫ్యాక్టరీలు, రైల్వేలు కొనుగోలు చేస్తాయి. ఇవన్నీ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఉత్పత్తి రంగాలు కాబట్టి ఇవి కొనుగోలు చేసే బొగ్గు ధరను ప్రభుత్వం సులభంగా పెరగనివ్వదు. బొగ్గు ఉత్పత్తి ఖర్చు పెరిగినా దాని అమ్మకం ధరను సింగరేణి కంపెనీ తగు మోతాదులో పెంచడానికి వీలులేదు. ఆ ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. యాజమాన్యానికి దానితో ప్రమేయం లేదు. ప్రస్తుత ధరలలో ఒక టన్ను బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చు 492 రూ.లు కాగా ఒక టన్ను బొగ్గు అమ్మకం ధర 436 రూ॥లు మాత్రమే. అంటే ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే ప్రతీ టన్ను బొగ్గుమీద యాజమాన్యానికి 56 రూ.లు నష్టం వస్తోంది. ఇది కేవలం ఈనాటి పరిస్థితి కాదు. గడచిన 15 సంవత్సరాలలో దేశంలో ధరల పెరుగుదలను గమనిస్తే నిత్యావసర వస్తువుల ధరల సూచిక మూడు లేక నాలుగు రెట్లు పెరిగింది. కానీ బొగ్గు అమ్మకం ధర సూచిక రెండు రెట్లు మాత్రమే పెరిగింది. ఇది సింగరేణి వంటి బొగ్గుగని కంపెనీల లాభాల మీదనే కాక వాటిలో పనిచేసే కార్మికుల జీతాల మీద కూడ ప్రభావం చూపుతుంది. సింగరేణి కంపెనీ చవకగా అమ్మే బొగ్గు వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా లాభాలు పొందే ప్రభుత్వ, ప్రైవేట్ రంగసంస్థలు కోట్లు మిగుల్చుకుంటుండగా, సింగరేణి మాత్రం నష్టాలలో ఉన్నట్లు చూపిస్తున్నారు. పోనీ 'నష్టాల'లో ఉందికదా అని బొగ్గు ఉత్పత్తి మీద ప్రభుత్వం పన్ను ఏమయినా తక్కువ తీసుకుంటున్నదా అంటే లేదు. బొగ్గు ఉత్పత్తిపైన విధించే పన్నునుండి ప్రభుత్వానికి వచ్చే రాబడి 1990-91లో 42.5 కోట్లుండగా, 1992-93లో 217.3 కోట్లయింది. అంటే రెండేళ్ళలో నాలుగు రెట్లయింది. ఉత్పత్తి ఖర్చు కంటే అమ్మకం ధర తక్కువగా నిర్ణయించి, పన్నులు మాత్రం నిర్దాక్షిణ్యంగా వసూలు చేసుకుంటే నష్టాలు రాక ఏమవుతుంది?

కార్మికుల క్రమశిక్షణా రాహిత్యం, పారిశ్రామిక అశాంతి నష్టాలకు ప్రధాన కారణమని ప్రభుత్వం ప్రచారం చేస్తుంది. గత అయిదు సంవత్సరాలలో సింగరేణి కార్మికులు అనేకసార్లు సుదీర్ఘమైన సమ్మెలు, పోరాటాలు చేసిన మాట వాస్తవమే కానీ ఆ పోరాటాలే చేయకపోతే కనీసమయిన వేతనప్రమాణాలు కానీ ఇతరహక్కులు కానీ కార్మికులకు దక్కేవి కావు. చాలా సందర్భాలలో (అన్ని పరిశ్రమలలాగే) యాజమాన్యం అమలు చేస్తామని ఒప్పుకున్న విషయాలను అమలు చేయించడానికే మళ్ళీమళ్ళీ సమ్మెలు చేయవలసి వచ్చింది.

అయితే ఈ క్రమంలో ఉత్పత్తి పడిపోకపోగా గణనీయంగా పెరిగింది. సింగరేణిలో వార్షిక ఉత్పత్తి 1986-87లో 160 లక్షల టన్నులు ఉండింది.

1992-93 నాటికి 225 లక్షల టన్నులకు పెరిగింది. 1993-94లో 252 లక్షల టన్నులు అంతుకుంది. అంటే 1986-87 నుండి 1993-94 నాటికి 57 శాతం పెరిగింది. అదే కాలంలో కార్మికుల నిజవేతనాలు 50 శాతం పెరగలేదు సరికదా, గణనీయంగా పడిపోయాయి. అంటే కార్మికులు తరుగుతున్న వేతనాలతో ఉత్పత్తిని వేగంగా పెంచుతున్నారు.

నిజమయినా అబద్ధమయినా 'నష్టం' అన్న వాదన వల్ల ప్రభుత్వానికీ యాజమాన్యానికీ చాలా ప్రయోజనాలుంటాయి. వేతనంబిల్లు పెరిగిపోయిందని చెప్పి కార్మికులను తొలగించవచ్చు. ఖర్చు ఆదా చేయడం కోసమని చెప్పి యంత్రీకరణ చేపట్టవచ్చు. పారిశ్రామిక శాంతి నెలకొల్పితే తప్ప నష్టాల ఊబి నుండి సంస్థ బయటపడదని చెప్పి కార్మికుల పైన, కార్మికుల రాజకీయహక్కులపైన దాడి చేయవచ్చు.

పారిశ్రామిక వివాదాలు అనవసరంగా తలెత్తే పరిస్థితి రాకుండ ఉండడానికీ, తలెత్తితే అవి త్వరగా సరిష్కారం కావడానికీ అవసరమయిన చర్యలు యాజమాన్యం తొలినుండి చేపట్టి ఉంటే ఇంతటి అశాంతి ఉండేదే కాదు. కార్మిక యూనియన్‌కు ఎన్నికలు నిర్వహించి కార్మికులకు తమకు ఇష్టమయిన ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఇమ్మని చాలాకాలంగా ఒక డిమాండ్ ఉంది. మెజారిటీ కార్మికుల అభీష్టానికి ప్రతినిధి అయిన ఒక యూనియన్ ఉంటే సమస్యల సరిష్కారం కొంత త్వరితంగా జరుగుతుంది. అయితే ఈ డిమాండ్‌ను సింగరేణి యాజమాన్యం ఎన్నడూ ఖాతరు చేయలేదు. దీని ఫలితంగా ఎవరికి ఎంత బలం ఉందో తెలియని అనేక సంఘాలు తయారయ్యాయి. అన్ని ప్రధాన కేంద్రట్రేడ్ యూనియన్లకూ సింగరేణి గనులలో సంఘాలున్నాయి. విప్లవపార్టీలన్నిటికీ సంఘాలున్నాయి. ఒక్కొక్క వృత్తికి ఒకటి చొప్పున వివిధ 'క్రాఫ్ట్' యూనియన్లు ఉన్నాయి. మొత్తం సింగరేణి గనులలో 42 యూనియన్లు ఉన్నాయి. ఎన్నికలు నిర్వహించి ప్రాతినిధ్య యూనియన్‌ను గుర్తించే బదులు అసంఖ్యాకంగా ఉన్న ఈ యూనియన్లలో ఒక్కొక్కరితో విడివిడిగా వ్యవహరించి కార్మికులను చీల్చి కాలక్షేపం చేయడం సింగరేణి యాజమాన్యం అలవరచుకుంది. కార్మికులలో ఎంత బలమున్నదీ తెలియని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు కేవలం తమ సంస్థలకు ఉండే అఖిలభారత స్థాయివల్ల కార్మిక ప్రతినిధులయ్యారు. వాళ్లతో చేసుకునే ఒప్పందాలు కార్మికులకు సంతృప్తినివ్వకపోతే యాజమాన్యం కార్మికులనే తప్పు పడుతుంది. ఇదంతా పారిశ్రామిక శాంతికి దోహదం చేయగలదా?

పోనీ ఆందోళన చేయవలసిన సమస్యలు కార్మికులకు లేవా అంటే చాలా ఉన్నాయి. దేశంలోని బొగ్గుగనులన్నింటికీ వేతనాలు కేంద్రీకృతంగా నిర్ణయమవుతాయి. కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం వేజ్‌బోర్డులు నియమిస్తుంది. నాలుగవ వేజ్‌బోర్డ్ సిఫారసుల కాలపరిమితి 1991 జూన్‌తో అయిపోయింది. అయిదవ వేజ్‌బోర్డును నియమించి పెరిగిన ధరలకనుగుణంగా గని కార్మికుల వేతనాలు సవరించవలసిన అవసరం ఉంది. కానీ మూడేళ్ళు గడచినా అయిదవ వేజ్‌బోర్డు పత్తా లేదు. దానిగురించి గనికార్మికులు అనేక సార్లు ఆందోళన చేసారు. ప్రభుత్వం మాత్రం వేజ్‌బోర్డు సంగతి మరచిపోయినట్టుంది. 1991 జూన్ నాటికీ ఈనాటికీ నిత్యావసర వస్తువుల ధరలు ఎంతగా పెరిగాయి? సింగరేణి బొగ్గుగనులలో ఉత్పత్తి ఎంత పెరిగింది? 5వ వేజ్‌బోర్డు వెంటనే నెలకొల్పమని కార్మికులు ఆందోళన చేయడం క్రమశిక్షణారాహిత్యం అవుతుందా?

ప్రభుత్వం వేజ్‌బోర్డు నెలకొల్పకపోగా, నెలకొల్పమని అడిగితే అసలుకే మోసం వస్తుందేమోనని కార్మికులు భయపడే పరిస్థితి కల్పిస్తోంది. సింగరేణి గనులు 'సిక్' అయిపోయాయనీ, కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని 'కోల్ ఇండియా లిమిటెడ్'కు అప్పచెప్పుతారని కొంతసేపు, ప్రైవేటీకరిస్తారని కొంతసేపు, కొన్ని బావులు మూసేస్తారని కొంతసేపు, రకరకాల వదంతులను ప్రభుత్వం ప్రచారం కానిస్తూ ఉంది. గని అధికారులే ప్రచారం చేస్తున్నారు. నూతన ఆర్థిక విధానాలు ఆరంభమయిన తరువాత ఏం మాట్లాడితే ఏం కొంప మునుగుతుందోననే భయం ప్రభుత్వరంగ కార్మికులను పట్టుకుంది. ప్రైవేటీకరణ అనే బూచిని కార్మికుల నోళ్ళు మూయించే సాధనంగా వాడుకోవడం ప్రభుత్వం బాగా నేర్చుకుంది.

వేజ్‌బోర్డు ద్వారా రావలసిన వేతన సవరణలు అటుంచి అనేక ఇతర సమస్యలు సింగరేణి గని కార్మికులకు ఉన్నాయి. కార్మికులలో 33 శాతానికి మాత్రమే కంపెనీ గృహవసతి కల్పించింది. మిగిలినవాళ్ళు అధికభాగం 'అక్రమ' కట్టడాలలో బ్రతుకుతున్నారు. విద్యావైద్య సౌకర్యాలు సక్రమంగా లేవు. ప్రైవేట్‌గా డబ్బుపెట్టి కొనుక్కోలేని వాళ్ళకు కష్టమే. పనిస్థలంలో భద్రత లేకపోవడం పెద్ద సమస్య. క్రమం తప్పకుండ ప్రతిసంవత్సరం గని ప్రమాదాలలో 20 మందికి పైగా చనిపోతుంటారు. ఇంకా పెద్దసంఖ్యలో అంగవికులురవుతుంటారు. చాలాచోట్ల మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. బొగ్గు కాలుష్యం గనులలోనే కాక ఇళ్లల్లో కూడ పెద్ద సమస్య. చాలామంది కార్మికులు గనిలో తవ్వితీసే బొగ్గునే నేరుగా పొయ్యిలోకి వాడతారు. ఈ బొగ్గులో కాలుష్యం ఎక్కువ.

ఇటువంటి అనేక సమస్యలతో కార్మికులు సతమతమవుతున్నప్పుడు 'పారిశ్రామిక శాంతి' నెలకొనాలంటే యాజమాన్యం, ప్రభుత్వం తమ కార్మిక వ్యతిరేక వైఖరిని విడిచిపెట్టి చాలా బాధ్యతతో మెలగవలసి ఉంటుంది. కానీ పాలకుల వైఖరి అందుకు భిన్నంగా ఉంది. సమస్యలకు కార్మికుల మీదనే నెపం పెట్టడం, అణచివేత, నిర్బంధం ప్రయోగించడం పాలకుల విధానం అయిపోయింది. ఇది ఈమధ్య కాలంలో బాగా పెరిగింది.

గోదావరిఖని, బెల్లంపల్లి, రామకృష్ణాపురం, మాదారం, మందమర్రిలలో గనికార్మికులవాడలలోనే 'ఎన్‌కౌంటర్లు' జరిగాయి. కార్మికుల పిల్లలు చాలామంది 'ఎన్‌కౌంటర్ల'లో చనిపోయారు. సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ జవాన్లు గనికార్మికులవాడలలో గస్తీ తిరుగుతున్నారు. పరిశ్రమల ఆస్తులను సంరక్షించడం కోసం ఉద్దేశించబడ్డ సిఐఎస్ఎఫ్ జవాన్లు కార్మికుల పాలిటి యమభటులయ్యారు. స్టెన్‌గన్లు, ఎస్ఎల్ఆర్‌లు పట్టుకొని 'బావుల' దగ్గర కాపలా కాసే సిఐఎస్ఎఫ్ జవాన్లు కాపాడుతున్నది కంపెనీ ఆస్తులను కాదు, యాజమాన్యం ఆధిపత్యాన్ని, దోపిడీని. నిత్యం గనికార్మికవాడలలో దాడులు చేసే సివిల్‌పోలీసులూ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులూ వందల సంఖ్యలో యువకులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి 'టాడా' కేసులు తయారుచేసి జైలుకు సంపిస్తున్నారు. బెల్లంపల్లిలో, మందమర్రిలో కొందరు కార్మిక యువకులు పోలీసు కస్టడీనుండి 'మాయం' కూడ అయ్యారు. ప్రస్తుతం నిషేధానికి గురి అయివున్న సింగరేణి కార్మిక సమాఖ్య ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాలలో ఈ నిర్బంధం కూడ అధికంగా ఉంది.


## కొత్త స్టాండింగ్ ఆర్డర్స్

ఈ మధ్య సింగరేణి యాజమాన్యం జారీచేసిన నూతన స్టాండింగ్ ఆర్డర్స్‌ను పై నేపథ్యంలో చూడాలి. అణచివేత అంటే కేవలం చిత్రహింసలు, ఎన్‌కౌంటర్లు మాత్రమే కాదు. తీవ్రమయిన ఆ అణచివేతతో ఉద్యమాలను

# మృత్యుఖని సింగరేణి

అన్ని బొగ్గు గనులలాగే సింగరేణి కూడ ప్రమాదాల నిలయం. దాదాపు ప్రతీరోజూ చిన్నవీ పెద్దవీ ప్రమాదాలు జరుగుతాయి. పై కప్పు కూలడం, పక్కగోడలు కూలడం, షార్ట్‌ఫైరింగ్, ఎయిర్‌బ్లాస్ట్‌లు, టబ్బులు బోల్తాపడడం, మొదలయిన కారణాలవల్ల ప్రమాదాలు జరుగుతాయి. బొగ్గుగనులలో భద్రతకు సంబంధించి కొత్తకొత్త పద్ధతులు అనేకం వాడుకలోకి వచ్చినప్పటికీ సింగరేణి యాజమాన్యం అశ్రద్ధ చేస్తూ ఉంది భద్రతకు సంబంధించిన అన్ని నియమాలనూ తు.చ. తప్పకుండా పాటిస్తే కంపెనీని మూసుకొని పోవలసి వస్తుందని కంపెనీ అధికారులు 'ఆఫ్ ది రికార్డ్' సంభాషణలో అంటుంటాడు.

ఈ వైఖరి ఫలితమేమిటంటే ప్రతీసంవత్సరం సింగరేణి గనులలో వందలాది ప్రమాదాలు జరగటం, వందల సంఖ్యలో కార్మికులు గాయపడడం, సగటున సంవత్సరానికి 20 నుండి 30 మంది దాకా చనిపోవడం. తన యాజమాన్యంలో ఉన్న గనులలో 19 గనులను 'తరచు ప్రమాదాలు జరిగే' గనులు గా సింగరేణి కాలియరీస్ కంపెనీ గుర్తించింది. ఈ ప్రమాదాల పరిమాణం ఏమిటో పట్టికలో చూడండి.



సింగరేణి గనులలో ప్రమాదాలు

| సంవత్సరం | ప్రమాదాలలో మరణించిన వారి సంఖ్య | గాయపడిన వారి సంఖ్య |
|---|---|---|
| 1980 | 21 | 586 |
| 1982 | 28 | 485 |
| 1983 | 21 | 595 |
| 1984 | 33 | 611 |
| 1985 | 35 | 506 |
| 1986 | 46 | 663 |
| 1987 | 26 | 329 |
| 1988 | - | 244 |
| 1989 | 17 | 261 |
| 1990 | 24 | 317 |
| 1991 | 18 | 260 |
| 1992 | 29 | 260 |
| 1993 | 31 | 250 |
| 1994 | 29 | 100 |
| (జూన్ నాటికి) | 358 | 5467 |

బరువయిన పనులు చేసేటప్పుడు చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతుంటాయి. వాటిని కూడ ఈ పట్టికలో లెక్కపెట్టామనుకుంటారేమో. అది నిజం కాదు. తీవ్రమయిన దెబ్బలు తగలకపోతే నమోదు చేయించుకోకుండా 'దులుపుకొనిపోయే' అలవాటు సింగరేణి కార్మికులకు వచ్చింది. కాబట్టి రొటీన్‌గా జరిగే చిన్నచిన్న ప్రమాదాలు రికార్డుకెక్కే అవకాశమే లేదు.

భద్రతకు సంబంధించి గనులలో అనేక చట్టాలు నియమాలు ఉన్నాయి. భద్రతేకాక కార్మికుల ఆరోగ్యాన్ని పరిసరాల పరిశుభ్రతనూ కాపాడడానికి కూడ అనేక నియమాలున్నాయి. వాటిని అమలు చేస్తే కనీసం సగం ప్రమాదాలు జరగవు. కార్మికుల ఆరోగ్యం ఇంతగా క్షీణించదు. గనికప్పును నిలబెట్టే రూఫ్ సపోర్టు చర్యలు, గని గోడలను బలపరచే చర్యలు, తదితర రక్షణ చర్యలు తీసుకోవాలని చట్టం అంటుంది. ఇవేవీ తీసుకోకపోగా గని కప్పులను నిలబెట్టే కలప నాసిరకానిది వాడుతున్నారని కార్మికులేకాదు, గనుల రక్షణ విభాగం నిపుణులు సహితం యాజమాన్యాన్ని నిందిస్తున్నారు. ఒక గనిలోని లోపం వల్ల కార్మికుల ప్రాణాలకు అపాయం ఉండగలదని భావిస్తే ఇన్స్‌పెక్ట్ చేసే అధికారం మైనింగ్ ఇన్స్‌పెక్టర్‌కు ఉంది. కానీ ఆ ఇన్స్‌పెక్షన్ ఎన్నడూ జరగదు. గనిలో ప్రాథమిక చికిత్సాలయం ఉండాలని అంబులెన్స్ ఉండాలనీ గని రూల్స్ (1955) అంటాయి. కానీ ఇది కూడ అమలులో లేదు. రూల్ 30 ప్రకారం ప్రతి కార్మికునికీ రెండు లీటర్ల చల్లటి మంచి నీరు అందుబాట్లో ఉండాలి. కానీ పనిస్థలంలో ఈనాటికీ తగినంత నీటి వసతి కూడ లేదు. మంచినీటి కోసం సింగరేణి కార్మికులు చాలా సార్లు ఆందోళన చేసారు. రూల్ 33 ప్రకారం కనీసం 50 మంది కార్మికులకు ఒక మరుగుదొడ్డి ఉండాలి. స్నానాల గదులు ఏర్పాటు చేయాలి. అయితే ఈ సౌకర్యాలు కూడాలేవు.

నిత్యజీవిత సౌకర్యాల నుండి గనుల భద్రతా చర్యల వరకు ఏవీ సరిగా అమలు కాని పరిస్థితిలో సింగరేణి గని 'మృత్యు గని' కాక ఏమవుతుంది? భద్రతా చర్యలను పర్యవేక్షించే అధికారం ఉన్న సూపర్‌వైజర్లు తదితర అధికార్లు ఉన్నారు. కానీ వాళ్లు శ్రద్ధగా పని చేయటం లేదని కార్మిక సంఘాలే కాక సీనియర్ కార్మికులు సహితం అంటున్నారు. భద్రతా చర్యలు తీసుకోవడం అటుంచి ప్రమాదం ముంచుకొస్తుందని తెలిసి కూడ ఒక్కొకసారి అవే పని స్థలాలలో పని చేయిస్తూ తమ ప్రాణాలు పోవడానికీ తాము వికలాంగులు కావడానికి గని అధికారులు కారణం అవుతున్నారని సీనియర్ కార్మికులు ఆరోపిస్తున్నారు.

అణచివేసిన తరువాత నిత్యజీవితంలో కార్మికులు అనుభవిస్తున్న చిన్నచిన్న హక్కులనుండి పెద్దహక్కులదాకా అన్నిటినీ ఒక్కొక్కటిగా తొలగించి వేయడం యాజమాన్యాలకు సులభం అవుతుంది. నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లు తయారయి ఢిల్లీలో చట్టసభల ఆమోదానికి సిద్ధంగా ఉంది. ఈలోపల సింగరేణి యాజమాన్యం ఏ యూనియన్‌ను సంప్రదించకుండ తనవంతుగా కొత్త స్టాండింగ్ ఆర్డర్స్ పేరుతో కార్మికుల కాళ్ళకూ చేతులకూ మరిన్ని సంకెలలు బిగించే నియమాలు జారీచేసింది. యాజమాన్యానికి ఈ స్టాండింగ్ ఆర్డర్స్ గతంలో ఎన్నడూ లేనంతటి అధికారం ఇస్తాయి. గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను తొలగిస్తాయి.

'క్రమశిక్షణ' అనేదానిని ఈ నూతన స్టాండింగ్ ఆర్డర్స్ కార్మికులకు గుదిబండగా మారుస్తాయి. పాతస్టాండింగ్ ఆర్డర్స్‌లో 20 చర్యలను క్రమశిక్షణకు విరుద్ధమయినవిగా ప్రకటించారు. కొత్తస్టాండింగ్ ఆర్డర్స్ 43 చర్యలను క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రకటించింది. వీటినన్నిటినీ దృష్టిలో పెట్టుకుని పనిచేస్తే కార్మికులు పూర్తిగా యంత్రాలలయిపోయి పనిచేయవలసి ఉంటుంది. మనుషులుగా వాళ్ళు చేయగల ఏ పని అయినా క్రమశిక్షణకు విరుద్ధం కాగలదు.

కాలియరీస్ ఆవరణలోనేకాక ఎక్కడయినా కార్మికులు తాగినా పేకాడినా కొట్లాటలలో దొమ్మీలలో పాల్గొన్నా అది క్రమశిక్షణకు విరుద్ధమయిన చర్యగా భావించబడుతుంది. పై అధికారుల పైవ చాడీలు చెప్పటం లేక నిందారోపణలు చేయడం, రేడియోలో టీవీలో పత్రికలలో కంపెనీ అనుమతి లేకుండా కంపెనీకి సంబంధించిన సమాచారం ప్రకటించడం, కంపెనీ అనుమతి లేకుండ కంపెనీ ఆవరణలో లేక కంపెనీ స్థలాలలో ఏదయినా ప్రదర్శన లేక సమావేశం నిర్వహించడం, ఇవన్నీ క్రమశిక్షణకు విరుద్ధమయిన చర్యలే. అంటే ఉత్పత్తికీ కంపెనీ ఆస్తులకూ ఎటువంటి హాని కలిగించకుండా కార్మికులు తమ నిరసన తెలియజేయడానికి తమకు రాజ్యాంగంలో ఉన్న వాక్స్వాతంత్ర్యాన్ని సమావేశస్వేచ్ఛను వినియోగించుకోవడం కూడ క్రమశిక్షణకు విరుద్ధమైన చర్యే అవుతుంది. పని అశ్రద్ధగా చేయడం, నిష్కారణంగా ఎగ్గొట్టడం మొదలయినవి ఏ కంపెనీలోనయినా క్రమశిక్షణకు విరుద్ధమైన చర్యలుగా భావిస్తారు కానీ కంపెనీలో జరిగే అక్రమాలను పత్రికలకు తెలియజేయడం కూడ క్రమశిక్షణకు విరుద్ధమనే ఘనత సింగరేణి యాజమాన్యానికే దక్కింది. పై అధికారుల తప్పుల గురించి మాట్లాడుకోవడం కూడ క్రమశిక్షణకు విరుద్ధమేనంట. ఎక్కడో అల్లర్లలో పాల్గొన్నా క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చుననడం, కంపెనీ బయట పేకాడినా తీసుకోవచ్చుననటం, క్రమశిక్షణ చర్య తీసుకోవడానికి సాకులు వెతుక్కోవడం తప్ప నేరే కాదు. ఈ విధంగా క్రమశిక్షణకు విరుద్ధమైన ప్రవర్తనగా 43 చర్యలను ప్రకటిస్తూ, ఎందుకయినా మంచిదని 'ఉద్దేశ్యపూర్వకంగా క్రమశిక్షణను అతిక్రమించడం' అనే అనిర్దిష్టమయిన చర్యను కూడ వాటిలో ఒకటిగా చేర్చారు.

క్రమశిక్షణకు ఇచ్చిన ఈ కొత్త నిర్వచనమే కాక నూతనస్టాండింగ్ ఆర్డర్స్‌లో అనేక ఇతర సంకెలలు కూడ పొందుపరిచారు. అటెండెన్స్ వేయించుకునే బాధ్యత కార్మికునిదేనన్నారు. అంటే ఒక కార్మికుడు పనికి హాజరయినప్పటికీ సంబంధిత ఉద్యోగి నిర్లక్ష్యం వల్ల అటెండెన్స్ పడకపోయినా గైర్ హాజరయినట్లే లెక్క. కార్మికులు నిర్ణీత గడువులో వైద్య పరీక్షలు చేసుకోవడం తప్పనిసరి చేసారు. వైద్యపరీక్ష అనంతరం పనిచేయడానికి అనర్హునిగా గుర్తిస్తే 'మెడికల్లీ అన్‌ఫిట్' అని ప్రకటించి పనినుండి తొలగిస్తారు. ఈ విషయంలో కంపెనీ మెడికల్ బోర్డుదే తుదినిర్ణయం. యాజమాన్యానికి ఇష్టంలేని కార్మికులను తీసివేయడానికి ఇది చక్కటి అవకాశం. ఇప్పటివరకు ఒక కార్మికుడు అనారోగ్య కారణంగా విరమించుకుంటే అతని స్థానంలో అతని తమ్ముడు, కొడుకు లేక ఇతర సమీప బంధువుకు ఏదో ఒక ఉద్యోగం ఇవ్వడం జరుగుతున్నది. కంపెనీలో ఉద్యోగానికి అవసరమయిన కనీస అర్హత ఉందా లేదా అనేది ఒక్కటే ప్రమాణం. ఇప్పుడు నూతన స్టాండింగ్ ఆర్డర్స్ వైద్యపరీక్షలను కంపల్సరీ చేయడం, కంపెనీ మెడికల్ బోర్డు అభిప్రాయాన్ని అంతిమ నిర్ణయం చేయడమే కాక, తొలగించిన కార్మికుని స్థానంలో ఒక డిపెండెంట్‌కు ఉద్యోగం ఇచ్చే భరోసా కూడ లేకుండ చేసింది. 'ఖాళీ ఉంటే'నే ఇస్తారంట.

నూతనస్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం కార్మికులందరూ ఇకమీదట కంపెనీ నుండి గుర్తింపుకార్డులు పొందుతారు. అది ఎప్పుడూ తమవద్ద ఉంచుకోవాలి. అడిగినప్పుడు చూపించాలి. గనిలోకి ప్రవేశించేటప్పుడు, బయటకు పోయేటప్పుడు కార్మికులు నిర్ణీత మార్గంలో ప్రయాణించాలి. అప్పుడు తనిఖీ చేస్తారు. నిర్ణీత సమయంలోనే పనికి హాజరు కావాలి. పై అధికార్ల అనుమతి లేకుండ పనిస్థలం వదిలి వెళితే హాజరును సహితం గైర్‌హాజరుగా మార్చే అధికారం పై అధికారికి ఉంటుంది. కార్మికుల డ్యూటీషిఫ్టులను యాజమాన్యం తన అవసరాలను బట్టి కార్మికులను సంప్రదించకుండా మార్చవచ్చు. ఆ మార్పును కార్మికుడు తిరస్కరిస్తే అది శిక్షార్హమయిన నేరం.

ఓవర్‌టైం పనిచేయడానికి, లేకపోతే సెలవుదినంలో పనిచేయడానికి నిరాకరించే హక్కు కార్మికులకు ఉండదు. నిరాకరిస్తే సంబంధిత అధికారికి సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది. సంజాయిషీ సంతృప్తికరంగా లేకపోతే ఆ నిరాకరణ శిక్షార్హం అవుతుంది.

వీటిలో చాలా వరకు పాతస్టాండింగ్ ఆర్డర్స్‌లో లేవు. కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న స్వేచ్ఛనూ హక్కులనూ తొలగించి కార్మికులను నియమాలతో బంధించడం ఈ నూతన స్టాండింగ్ ఆర్డర్స్ ఉద్దేశ్యం. చూడడానికి ఈ కొత్త మార్పులలో భయంకర నిర్బంధమేమీ కనిపించకపోవచ్చు. కానీ ఇవి కార్మికులను యంత్రాల స్థాయికి దిగజారుస్తాయి. మరోకవైపు సంఘటిత కార్యాచరణను కష్టతరం చేస్తాయి. ఇవి రెండూ నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలకు అవసరమే.

## కస్టడియల్ రేప్

కస్టడీ రేప్ మీద పి.యు.డి.ఆర్. ఒక నివేదిక ప్రచురించింది. చట్టం ఏం చెపుతుందో, 1983 నుంచి కోర్టులు ఎలాటి తీర్పులు యిచ్చాయో, 1989 నుంచి 1993 వరకు ఢిల్లీలో తాము నిజ నిర్ధారణ జరిపిన పది కస్టడీ రేప్‌లలో చివరికి ఏం జరిగిందో (లేక ఏం జరగలేదో) ఆ వివరాలన్నీ యిందులో ఉన్నాయి. సుప్రీంకోర్టు రెండు కేసుల్లో మాత్రమే యిచ్చిన నష్టపరిహారం విషయాలూ ఉన్నాయి. కావలసినవారు డాక్టర్ సుదేశ్ వైద్. D-2 స్టాఫ్ క్వార్టర్స్, ఐ.పి. కాలేజి, శ్యామ్‌నాథ్ మార్గ్, ఢిల్లీ 110054 చిరునామాకు పదిరూపాయలు పంపి తెప్పించుకోవచ్చు.